

# జై భీమ్

తెలుగు దినపత్రిక

POWER OF PEOPLE

సమస్యలపై సమరంగా

Jai Bheem TV

STRUGGLE FOR JUSTICE

సామాన్యుడి ఆయుధంగా




సంపుటి - 06 | సంచిక 365 | ఎడిటర్ : బరిగెల శివ | సోమవారం 01, డిసెంబర్ 2025 | పేజీలు 8 | వెల రూ. 5

పబ్లిషర్స్ తెలంగాణ : హైదరాబాద్, ఆంధ్రప్రదేశ్ : విజయవాడ, ఢిల్లీ, కర్ణాటక, బెంగళూరు, తమిళనాడు, చెన్నై, మహారాష్ట్ర, ముంబై, గోవా, కేరళ, ఉత్తరప్రదేశ్, పజాజ్, పశ్చిమబెంగాల్, అమెరికా, లండన్, ఆస్ట్రేలియా, దుబాయ్, మస్కట్


# రాష్ట్రంలో.. సర్పంచ్ ఎన్నికల హడావిడి




- పోటీదారులను పసిగట్టండి నకిలీదారులను ఒడగొట్టండి
- ప్రజాసేవకు అంతరాయం కల్పించటోల్లే ఎక్కువగా నామినేషన్లు వేశారు
- అభ్యర్థులను ఎన్నుకోవడంలో ప్రజలు ఎప్పుడు ఓడిపోతూనే ఉన్నారు
- పైసాషకు ఓట్లు అమ్ముకునే దిక్కుమాలిన స్థితి ఎప్పుడు పోతుంది
- పార్టీలకు అతీతంగా ప్రజాసేవకులను సర్పంచులుగా ఎన్నుకోవాలి
- కాస్తంత నిర్లక్ష్యం వహించిన ప్రజల జీవితాలు వెనుకబడిపోతాయి
- బీసీలను విస్మరించిన ప్రభుత్వానికి తగిన గుణపాఠం జరిగేనా
- వికలాంగుల జీవితాలు బాగుపడేది ఎన్నడు
- సర్పంచ్ ఎన్నికల్లో రిజర్వేషన్ల లబ్ధిదారులు ఎవరు
- ప్రజలను మోసగించి ఎన్నికలు నిర్వహిస్తున్నట్లుగా ప్రభుత్వం
- న్యాయస్థానాల కేసులు పూర్తికాకముందే ఎన్నికలు నిర్వహించడం విడ్డూరంగాఉంది : డాక్టర్ బరిగెల శివ








**హైదరాబాద్(జై భీమ్ డెస్క్)**

తెలంగాణ రాష్ట్రంలో నిర్వహించబడుతున్న సర్పంచ్ ఎన్నికల హడావిడి అంతా ఇంతా కాదని డాక్టర్ బరిగెల శివ తన అభిప్రాయం తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా తొలి విడత నామినేషన్లలో ఎక్కువ శాతం ప్రజాసేవకు విగాథం కలిగించాలనే వ్యక్తిత్వ స్వభావం కలిగిన నాయకులే నామినేషన్లు వేసినట్లుగా ప్రజల భావిస్తున్నారన్నారు. కొంతమంది అధికార పార్టీని అడ్డం పెట్టుకొని నామినేషన్ వేయగా మరికొంతమంది ప్రతిపక్ష పార్టీలను ఆసరా చేసుకొని నామినేషన్ వేసినట్లు సమాచారమన్నారు.. మరికొంతమంది స్వతంత్ర అభ్యర్థులుగా పోటీలో నిలుస్తున్నారని తెలిపారు. ఇంకొంతమంది పదవి విరమణ పొందిన ఉద్యోగులు పదవి విరమణకు దగ్గరగా ఉండి ఉద్యోగాలకు రాజీనామా చేసి సర్పంచ్ ఎన్నికల్లో నామినేషన్ వేసినారని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా ఏకగ్రీవ తీర్మానం కోసం పరితపిస్తున్న చోటమోటా నాయకులు ఏకంగా పైన ప్రభావాన్ని తెరమీద తీసుకొచ్చి రాజకీయాలను ఒక్కసారిగా వాళ్ల వైపు తిప్పుకొనే ప్రయత్నాలు చేస్తున్నారన్నారు. గ్రామస్థాయి పాలనను దారిలో పెట్టాలనే సదుద్దేశంతో సర్పంచ్ ఎన్నికలు నిర్వహించబడుతుండగా లక్షల్లో కోటికి పైన ఎన్నికల నిర్వహణ కోసం అభ్యర్థులు డబ్బులు ఖర్చుచేయడానికి సంసిద్ధులుగా ఉండి ప్రజల ఆలోచనలను ప్రజల అభివృద్ధిని ప్రజల జీవన విధానాన్ని గ్రామస్థాయి పరిపాలన అభివృద్ధిని ఏకంగా శాసిస్తుండటం తోపాటు ఎన్నికల్లో నిలబడుతున్న అభ్యర్థులు ఏలాగైనా డబ్బులు ఖర్చు చేసి పదవి దక్కించుకోవాలని ఎంతగానో ఉవ్విల్లాడుతున్నారని తెలిపారు. మొదటి విడత ఎన్నికల్లో భాగంగా 31 జిల్లాలలో 189 మండలాల్లో 4236 గ్రామ సర్పంచ్ స్థానాలకు గాను 37,440 వార్డులకు ఎన్నికలు నిర్వహించబడాల్సి ఉండగా సర్పంచ్ స్థానాలకు

- మిగతా 2లో..

## తెలంగాణ పంచాయతీ ఎన్నికలు



- తొలి విడతకు వెల్లువెత్తిన నామినేషన్లు
- తొలి విడత పంచాయతీ ఎన్నికలకు 25 వేలకు పైగా నామినేషన్లు దాఖలు
- 4,236 గ్రామ పంచాయతీలకు కొనసాగుతున్న ఎన్నికల ప్రక్రియ
- డిసెంబర్ 11న తొలి దశ పోలింగ్, అదే రోజు ఓట్ల లెక్కింపు
- మొత్తం మూడు విడతల్లో 12,728 పంచాయతీలకు ఎన్నికలు
- కేంద్ర నిధుల కోసమే ముందుగా గ్రామ పంచాయతీ ఎన్నికల నిర్వహణ

2

### కొండగట్టులో భారీ అగ్నిప్రమాదం..

## కోట్లలో ఆస్తి నష్టం

- కొండగట్టు వద్ద గత రాత్రి భారీ అగ్నిప్రమాదం
- 32 బొమ్మల దుకాణాలు పూర్తిగా దగ్ధం
- సమ్మక్క జాతర కోసం నిల్వ ఉంచిన సరుకు బూడిద
- కోట్లాది రూపాయల ఆస్తినష్టం జరిగిందని అంచనా
- విద్యుత్ షార్ట్ సర్క్యూటే కారణమని ప్రాథమిక నిర్ధారణ

2

## మాదిగలు శక్తివంతులుగా ఎదగాలి

- రాజకీయ స్థిరత్వాన్ని పెంపొందించుకోవాలి
- మాదిగల చైతన్యం ఒక ప్రభంజనం కావాలి
- వెనుకబాటు తనం నుండి ముందు వరసకు ఎదగాలి
- మేధావులకు కొదువలేని మాదిగలు ఎంతో వెనుకబడ్డారు
- మాదిగలు నిస్వార్థంగా ఉన్నందునే విచ్ఛిన్నమయ్యారు
- పార్టీలతో సంబంధం లేకుండా మాదిగల ఐక్యవేదిక బలపడాలి
- వర్గీకరణ రిజర్వేషన్ల ఫలాలను అందిపుచ్చుకోలేకపోతున్నాం




**హైదరాబాద్(జై భీమ్ డెస్క్)**

మాదిగ మేధావులు రాజకీయ శక్తులుగా ఎదగాలనే ఆలోచనతో హైదరాబాదులో ఆదివారం మాదిగ మేధావులు అందరితో కీలక సమావేశం నిర్వహించబడింది. ఈ సమావేశానికి ముఖ్యులందరుహాజరై వాళ్ల అభిప్రాయాలను తెలియజేశారు అందులో ప్రధానంగా మాజీ మంత్రివర్యులు మోత్కుపల్లి నరసింహులు మాట్లాడుతూ మాదిగలకు రాజ్యాధికారం మన జనాభా దమాషా ప్రకారంగా తప్పకుండా వస్తుందని తెలిపారు. సంఘాలన్నీ పక్కనపెట్టి మాదిగ జాతి అభివృద్ధి కోసం అందరూ ఒక్క దాటిపైకి రావలసిన సమయం వచ్చిందన్నారు. మాదిగ మేధావుల రాజకీయ ఆలోచన బలపరిచే దిశగా కీలక సమావేశాలు

- మిగతా 2లో..

# తెలంగాణ పంచాయతీ ఎన్నికలు...

**తొలి విడతకు వెల్లువెత్తిన నామినేషన్లు**
**తొలి విడత పంచాయతీ ఎన్నికలకు 25 వేలకు పైగా నామినేషన్లు దాఖలు**
**4,236 గ్రామ పంచాయతీలకు కొనసాగుతున్న ఎన్నికల ప్రక్రియ**
**డిసెంబర్ 11న తొలి దశ పోలింగ్, అదే రోజు ఓట్ల లెక్కింపు**
**మొత్తం మూడు విడతల్లో 12,728 పంచాయతీలకు ఎన్నికలు**
**కేంద్ర నిధుల కోసమే ముందుగా గ్రామ పంచాయతీ ఎన్నికల నిర్వహణ**

**హైదరాబాద్, నవంబర్ 30 (జై భీమ్ న్యూస్) :**

తెలంగాణలో గ్రామ పంచాయతీ ఎన్నికల తొలి విడతకు నామినేషన్ల పర్వం ముగిసింది. రాష్ట్రంలోని 31 జిల్లాల్లో డిసెంబర్ 11న జరగనున్న మొదటి దశ ఎన్నికల కోసం సర్పంచ్ పదవులకు భారీగా నామినేషన్లు దాఖలయ్యాయి. మొత్తం 4,236 గ్రామ పంచాయతీలకు గాను 25,654 మంది అభ్యర్థులు బరిలో నిలిచారు. నామినేషన్ల చివరి రోజైన శనివారం ఒక్కరోజే 17,940 మంది తమ పత్రాలు సమర్పించడం విశేషం. అటు వార్డు సభ్యుల స్థానాలకు కూడా తీవ్రమైన పోటీ నెలకొంది. రాష్ట్రవ్యాప్తంగా 37,440 వార్డులకు 82,276 నామినేషన్లు దాఖలయ్యాయని రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదివారం వెల్లడించింది. ప్రస్తుతం అధికారులు నామినేషన్ల పరిశీలన ప్రక్రియ చేపట్టారు. అర్హులైన అభ్యర్థుల జాబితాను ఆదివారం రాత్రికి ప్రకటించే అవకాశం ఉంది. నామినేషన్లపై అభ్యంతరాలను డిసెంబర్ 1న స్వీకరించి, 2వ తేదీన పరిష్కరిస్తారు. నామినేషన్ల ఉపసంహరణకు డిసెంబర్ 4 చివరి తేదీ. షెడ్యూల్ ప్రకారం తొలి విడత పోలింగ్ డిసెంబర్ 11న ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు జరుగుతుంది. అదే రోజు మధ్యాహ్నం 2 గంటల నుంచి ఓట్ల లెక్కింపు చేపట్టి ఫలితాలు వెల్లడిస్తారు. రాష్ట్రంలో మొత్తం 12,728 గ్రామ పంచాయతీలకు, 1,12,242 వార్డులకు మూడు దశల్లో (డిసెంబర్ 11, 14, 17) ఎన్నికలు నిర్వహిస్తున్నారు. 15వ ఆర్థిక సంఘం నుంచి గ్రామ పంచాయతీలకు రావాల్సిన రూ.3,000 కోట్ల నిధులు 2026 మార్చి 31కి ముగిసిపోనున్న నేపథ్యంలో, రాష్ట్ర కేబినెట్ ముందుగా పంచాయతీ ఎన్నికలు నిర్వహించాలని నిర్ణయించింది. బీసీ రిజర్వేషన్లపై హైకోర్టు తుది తీర్పు వచ్చిన తర్వాతే ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలపై నిర్ణయం తీసుకోనున్నారు. హైకోర్టు ఆదేశాల మేరకు మొత్తం రిజర్వేషన్లు 50 శాతం మించకుండా, బీసీలకు 17.08 శాతం రిజర్వేషన్లు కేటాయించారు.

## కొండగట్టులో భారీ అగ్నిప్రమాదం.. కోట్లలో ఆస్తి నష్టం



**జగిత్యాల, నవంబర్ 30 (జై భీమ్ న్యూస్) :**

జగిత్యాల జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రం కొండగట్టులో శనివారం రాత్రి ఘోర అగ్నిప్రమాదం సంభవించింది. ఈ దుర్ఘటనలో దాదాపు 32 బొమ్మల దుకాణాలు పూర్తిగా కాలి బూడిదయ్యాయి. వ్యాపారులకు కోట్లాది రూపాయల నష్టం వాటిల్లినట్లు ప్రాథమికంగా అంచనా వేస్తున్నారు. గత రాత్రి 11 గంటల సమయంలో కొండగట్టు ఘాట్ రోడ్డులోని అభయ హనుమాన్ విగ్రహం నుంచి ప్రధాన రహదారి వరకు ఉన్న బొమ్మల దుకాణాల్లో మంటలు చెలరేగాయి. సమీపంలో జరగనున్న సమ్మక్క సారలమ్మ జాతరను దృష్టిలో ఉంచుకుని వ్యాపారులు భారీ ఎత్తున బొమ్మలను కొనుగోలు చేసి దుకాణాల్లో నిల్వ ఉంచారు. ఒక్కో దుకాణంలో రూ.8 లక్షల నుంచి రూ.10 లక్షల విలువైన సామగ్రి ఉన్నట్లు తెలుస్తోంది.

## కంపెనీ సీఈవోకు బహిరంగ లేఖ రాసిన వేలాదిమంది అమెజాన్ ఉద్యోగులు

**అమెరికా, నవంబర్ 30 (జై భీమ్ న్యూస్) :**

టెక్ దిగ్గజం అమెజాన్‌లో కృత్రిమ మేధస్సు (ఏఐ) అభివృద్ధి విధానాలపై సొంత ఉద్యోగులే తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. కంపెనీ అనుసరిస్తున్న అతివేగమైన ఏఐ వ్యూహం పర్యావరణానికి, ఉద్యోగాలకు, ప్రజాస్వామ్యానికి పెను ముప్పు కలిగిస్తుందని హెచ్చరిస్తూ సీఈఓ ఆండీ జాస్సీకి, యాజమాన్యానికి వేలాది మంది ఉద్యోగులు ఒక బహిరంగ లేఖ రాశారు. ఈ లేఖపై ఇప్పటివరకు 1,039 మందికి పైగా ఉద్యోగులు సంతకాలు చేశారు. వీరిలో ఏఐ వ్యవస్థలను డెవలప్ చేసే సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లు, ప్రొడక్ట్ మేనేజర్లు, వేర్‌హౌస్ సిబ్బంది కూడా ఉన్నారు. లేఖలో ఉద్యోగులు మూడు ప్రధాన అంశాలను ప్రస్తావించారు. ఏఐ అభివృద్ధి కోసం అమెజాన్ డేటా సెంటర్లపై 150 బిలియన్ డాలర్ల పెట్టుబడి పెట్టాలని యోచిస్తోందని, కానీ ఈ సెంటర్లు కర్బన ఉద్గారాలను పెంచుతున్నాయని ఆరోపించారు. 2040 నాటికి 'నికర-సున్నా' ఉద్గారాల లక్ష్యాన్ని నిర్దేశించుకున్నప్పటికీ, కంపెనీ ఉద్గారాలు 2019 నుంచి 35 శాతం పెరిగాయని గుర్తుచేశారు. మరోవైపు, చమురు, గ్యాస్ కంపెనీలకు ఏఐ సేవలు అందిస్తూ శిలాజ ఇంధనాల వెలికితీతను ప్రోత్సహించడంపై అభ్యంతరం తెలిపారు. ఇటీవల 30,000 మంది కార్పొరేట్ ఉద్యోగులను తొలగించిన తర్వాత, ఏఐ కారణంగా మిగిలిన వారిపై పనిభారం పెరిగిందని, నిఘా ఎక్కువైందని ఉద్యోగులు వాపోయారు. ఏఐ 'ఏజెంట్లు' మానవ ఉద్యోగాలను తగ్గిస్తాయని సీఈఓ చెప్పడాన్ని ప్రస్తావిస్తూ, ఇది ఉద్యోగులలో అభద్రతను పెంచుతోందని పేర్కొన్నారు. "ఏఐని అభివృద్ధి చేసేది, వినియోగించేది మేమే కాబట్టి, జోక్యం చేసుకోవడం మా బాధ్యత" అని ఉద్యోగులు తమ లేఖలో స్పష్టం చేశారు.

ఉద్యోగుల డిమాండ్లు

ఈ లేఖ ద్వారా ఉద్యోగులు యాజమాన్యం ముందు మూడు ప్రధాన డిమాండ్లను ఉంచారు:

1. పర్యావరణానికి హాని కలిగించే ఇంధనంతో ఏఐని అభివృద్ధి చేయవద్దు.
2. ఉద్యోగుల భాగస్వామ్యం లేకుండా ఏఐ విధానాలను రూపొందించవద్దు.
3. నిఘా, హింస, సామూహిక బహిష్కరణలకు ఏఐని ఉపయోగించవద్దు.

"సరైన నిబంధనలతో మెరుగైన ఏఐ భవిష్యత్తు సాధ్యమే. ఏఐ వల్ల కలిగే ప్రయోజనాలు, నష్టాలపై బహిరంగ చర్చ జరగాలి" అని వారు కోరారు.

# రాష్ట్రంలో సర్పంచ్ ఎన్నికల హడావిడీ

మొదటి పేజీ తరువాయి

గాను 8198 నామినేషన్లు దాఖలాలు కాగా వార్డు మెంబర్లకు గాను 11502 నామినేషన్లు వేయబడినట్లు విశ్వసనీయ సమాచారమన్నారు.తెలంగాణ రాష్ట్రంలో తెగిపోయే గాలిపటం లాంటి పదవుల కోసం తెగతిప్పల పడుతున్న సర్పంచ్ అభ్యర్థులు వాళ్లకు ఉండబడిన నివాసాలలోని కాస్తంత ఆస్తులను పణంగా పెట్టుకుని పోటీదారులుగా ముందుకు వస్తున్నారని తెలిపారు. గతంలో గ్రామాల అభివృద్ధి కోసం ప్రభుత్వాలు కేటాయించిన నిధులు అభివృద్ధి పనుల రూపంలో టెండర్ల రూపంలో పనులు జరిగినప్పటికీని సకాలంలో బిల్లులు రాక కాంట్రాక్టర్లు సర్పంచ్ అభ్యర్థులు నెత్తి నోరు మొత్తుకొని ధర్నాలు రాస్తారోకోలు చేసిన సంఘటనలు ఎన్నో కలవన్నారు. అయినప్పటికీని సర్పంచ్ పదవి అనేది రాజకీయ భవిష్యత్తును నిర్మిస్తుందని భావిస్తున్న వ్యక్తులు గ్రామాల్లోని ప్రజల్ని మచ్చిక చేసుకొని రాజకీయ భవిష్యత్తు నిర్మించుకోవడం కోసం ఎన్నికలలో నిలబడుతున్నట్లుగా భావించాల్సి ఉంటుందన్నారు. ప్రస్తుతం సంవత్సరంన్నరపాటు సర్పంచ్ లేని గ్రామాలు ఎంతవరకు అభివృద్ధి చెందినాయో ప్రభుత్వాలు ప్రతిపక్షాలు పాత సర్పంచులు గ్రామస్థాయి కార్యదర్శిలు స్పష్టమైన ఆధారాలను వెల్లడించలేకపోతున్నారన్నారు. ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు ప్రతి ఒక్కరు అభివృద్దే లక్ష్యంగా ముందుకు వస్తున్నాం ప్రజలారా మమ్మల్ని దీవించండి ఆశీర్వదించండి గెలిపించండి అభివృద్ధి చేస్తామంటూ కల్లి బొల్లి మాటలతో ప్రజలను మభ్యపెట్టడం పచ్చి మోసం లాంటిది అన్నారు. వాస్తవానికి నిజాయితీని పసిగట్టాల్సి వస్తే గ్రామస్థాయిని అభివృద్ధి చెందించాలంటే విద్యార్థి నాయకులు గానీ నిజాయితీ కలిగిన పెద్దమనుషులు గానీ పైసా ఆశ చూడకుండా ప్రజల కోసం ప్రజాభివృద్ధి కోసం పాటుపడగల వ్యక్తిత్వ స్వభావం కలిగినటువంటి వాళ్ళు సర్పంచ్ ఎన్నికల్లో పోటీ చేయాల్సి ఉండగా ఇంచుమించు 60 శాతం మంది పోటీలో నిలిచిన ప్రస్తుత సర్పంచ్ అభ్యర్థులు రాజకీయంపై మక్కువతో అధికారం పై దాహంతో మాత్రమే పోటీలో నిలుస్తున్నట్లుగా అనిపిస్తుందన్నారు. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా బీసీలకు తీవ్రమైన మోసం చేసిన కాంగ్రెస్ పార్టీని తగిన స్థాయిలో బుద్ధి చెప్పాలని బీసీ నాయకులు బీసీ ఉద్యమకారులు బిసి విద్యార్థి నేతలు స్వతంత్ర అభ్యర్థులుగా పోటీలో నిలుస్తూ గ్రామస్థాయి పాలనలో కాంగ్రెస్ పార్టీకి ముచ్చమటను పుట్టించే ప్రయత్నాలు చేస్తున్నారన్నారు. వాళ్లకు తోడుగా దివ్యాంగుల సంక్షేమాన్ని మర్చిపోయిన ప్రభుత్వానికి సంక్షేమం బలం ఏ విధంగా ఉంటుందో రుచి చూపించడానికి వికలాంగులు ముందుకొస్తున్నారన్నారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఇతర పార్టీల తరపున నిలబడిన అభ్యర్థులను పోటీ నుండి తప్పించడానికి రాజకీయ ఒత్తిళ్లతో పాటు రాష్ట్రవ్యాప్తంగా రాజకీయ నాయకులకు అనుకూల మైనటువంటి పోలీస్ అధికారుల ఒత్తిళ్లు కూడా ఎక్కువ అవుతున్నాయని అభ్యర్థులు బాధ వ్యక్తం చేస్తున్నారన్నారు.ప్రస్తుతం తెలంగాణ రాష్ట్రంలో గ్రామాల అభివృద్ధి పురోగతి ఎంత ముందుకు సాగుతుందో తెలియదు గానీ ఉన్నపాటుగా సంక్షేమ పథకాలు చేర వేస్తామనడం అధికార దాహార్తికి దర్పణం లాంటిది అన్నారు. మొదటి విడతగా జరగబోతున్న సర్పంచ్ ఎన్నికల్లో ప్రజల మనసును నిజాయితీగా గెలుచుకున్న నాయకులు మాత్రమే గెలుపొందినట్లయితే గ్రామాల అభివృద్ధి స్వచ్ఛందంగా పెంపొందించబడుతుందని తెలుపుతూ అలా జరగన పక్షాన రాజకీయ ఒత్తిళ్లు రాజకీయ ప్రలోభాలు మందు స్వభావం బీర్లు, బిర్యానీలు స్వభావాలు పెరిగిపోయి ప్రజా వ్యతిరేక నాయకులు గనుక గెలిచినట్లయితే దాని పూర్తి బాధ్యత ఆయా గ్రామాలపై ప్రభావం చూపిస్తుంద అన్నది ఎట్టి పరిస్థితుల్లో ప్రజలు మర్చిపోవద్దని గుర్తు చేశారు. గ్రామస్థాయి పాలన అంటేనే ప్రతి కుటుంబంలోని పిల్లల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని నాయకులను ఎన్నుకోవాల్సిన అవసరం ఉంటుందని గుర్తుచేశారు పబ్లిక్ హెల్త్ సెంటర్ లాంటి చిన్న వైద్యశాలలు ప్రభుత్వ పాఠశాలలో గ్రామస్థాయి రైతాంగ స్వచ్ఛంద సంస్థలు, గ్రామస్థాయి మహిళా సంఘాల గ్రూపులు ఉన్నత స్థాయిలో అభివృద్ధి చెందాలంటే చదువుకున్న వ్యక్తులు రాజకీయ పరిజ్ఞానం కలిగిన వ్యక్తులు పైసాష లేనటువంటి వ్యక్తులు సర్పంచులుగా గెలుపు పొందగలిగితే ప్రజల జీవన విధానం మెరుగుపడే ఆస్కారం ఉందన్నారు. ప్రతి గ్రామానికి ఒక్కొక్క అభ్యర్థి అసెంబ్లీ స్థానాల్లో పోటీ చేసిన అభ్యర్థుల కన్నా ఎక్కువ మేనిఫెస్టోను సిద్ధపరచుకొని కరపత్రాల రూపంలో సిద్ధపరచుకొని పంచుకుంటూ తిరుగుతూ వాటిని ప్రచారాలు చేసుకుంటున్నారని వాటిని ఏమాత్రం ప్రజలు నమ్మకూడదని సూచించారు. ప్రజల శ్రేయస్సు కొరకు పాటుపడే నాయకులను ప్రజలే గుర్తించుకొని వాళ్లను గెలిపించుకోవడం కోసం స్వచ్ఛందంగా సమావేశాలు ఏర్పాటు చేసుకొని ఆయా గ్రామాల అభివృద్ధికి పాటుపడాలని సూచించారు. ఓవైపు బీసీలు మరోవైపు వికలాంగులు వాళ్లకు తోడుగా మైనార్టీలు గ్రామస్థాయిలో వాళ్లకు జరుగుతున్న అనేక ఇబ్బందుల దృష్ట్యా రాష్ట్ర ప్రభుత్వానికి వ్యతిరేక పావులు కదుపుతున్నట్లుగా విశ్వసనీయ . పెద్ద నాయకులకు పట్టింపు లేదు చిన్న నాయకులు కాకపడుతున్నారు. ఎక్కడి పాలనరో బాబు అంటూ ప్రజలు నెత్తి నోరు కొట్టుకుంటున్న సందర్భంలోనే సర్పంచ్ ఎన్నికలు రావడం గమనిస్తుంటే మెజార్టీ స్థానాల్లో మేధావులను ఎన్నుకోవడం కోసం ప్రజలు కంకణ బద్దులు అవుతున్నట్లుగా ప్రతి గ్రామంలోని సర్వే నివేదికలు వెల్లడిస్తున్నాయన్నారు.



# మాదిగలు శక్తివంతులుగా ఎదగాలి

మొదటి పేజీ తరువాయి







నిర్వహించుకోవాలని సూచించారు. మాదిగ సమాజ భవిష్యత్ రాజకీయ దిశ,నాయకత్వ నిర్మాణం,రాబోయే తరాలకు మాదిగల హక్కులు, శక్తివంతమైన రాజకీయ రూపకల్పనపై ప్రముఖ మేధావులు,ఆలోచనాపరులు, ఉద్యమకారులు మాదిగల అభివృద్ధి కోసం సమాలోచనలు చేయాల్సి ఉందన్నారు. ఈ సమావేశం మాజీ మంత్రి వర్యులైన మోత్కుపల్లి నరసింహులు నివాసంలో ప్రొఫెసర్ డప్పు కనకయ్య ఆధ్వర్యంలో నిర్వహించబడింది. తెలంగాణ అంతటా వివిధ జిల్లాల నుంచి ఇద్దరు ప్రతినిధులుగా మేధావులు,యువ నాయకులు, రాజకీయ రంగంలో ఉన్నవారు హాజరై సమావేశాన్ని విజయవంతం చేశారు.సమావేశంలో సమాజానికి భవిష్యత్తులో అవసరమైన రాజకీయ విధానాలు,మాదిగ నాయకత్వం ఎదుర్కొంటున్న అడ్డంకులు, రాబోయే తరాల రాజకీయ అవగాహన, విద్య, ఉద్యమ తీరుపై విస్తృతంగా చర్చ జరిగింది. ఈ సందర్భంగా మాట్లాడిన జై భీమ్ టీవీ చైర్మన్ డాక్టర్ బరిగెల శివ మాట్లాడుతూ:"మాదిగలు ఇకనుండి అవకాశాల కోసం ఎదురు చూడడం కాదు.. రాజకీయంగా ఎదగాల్సిన సమయం వచ్చింది. మన సమాజం సంఖ్యలో పెద్దదైనా, సీట్లలో చిన్నదిగా ఉండటం అన్యాయం. మాదిగల ఓటు శక్తి ఎంత కీలకమో రాబోయే ఎన్నికల్లో దేశం గుర్తించేలా పనిచేయాలి" అని అన్నారు.మాదిగలు ప్రతి ఉద్యమంలో శక్తివంతమైన పునాదులు వేస్తున్నారని దీర్ఘాధికా సమస్యలన్నీ ఉద్యమరూపాంతరం దాల్చి పరిష్కారం సాధించబడుతున్నాయని అలాంటి సంఘటనలను అలాంటి సందర్భాలను లెక్కలేనని చెప్పొచ్చు అన్నారు.మన నిర్మాణం మనం వేసుకుంటే తప్ప ఇంకా ఎంతకాలం ఇతరులపై ఆధారపడి రాజకీయ శక్తుల కోసం ఎదురుచూడాల్సి వస్తుందో గమనించాల్సి ఉందన్నారు.ఉద్యమం మనం చేస్తే ఫలితాలు ఇతరులను అనుభవిస్తున్నారని జాగ్రత్తగా పసిగట్టాలని సూచించారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ మురళీ దర్శన్ మాట్లాడుతూ మాదిగలకు చైతన్యం రావాలని మాదిగలకు చైతన్యం వస్తేనే అభివృద్ధి వరుసలో ఉంటామని గుర్తుకు చేశారు.తన కృషి తన పట్టుదల తన పోరాటమంతా మాదిగలు ముందు వరుసలో ఉండే విధంగా ఐక్యంగా నిలబడుతూ బలపడే విధంగా ఎంతో కృషి చేస్తున్నానని తెలిపారు. అలాగే యువతలో రాజకీయ చైతన్యం,నాయకత్వ శిక్షణ, డిజిటల్ ఉద్యమం, ఒకే వేదికగా మాదిగల ఐక్యత అనే అంశాలు సమావేశంలో ప్రధాన అజెండాగా నిలిచాయి.మాదిగ సమాజ రాజకీయ భవిష్యత్తు కోసం ఇలాంటి ఆలోచనా సభలు తరచూ జరగాలని, సమాజ మొత్తం ఒకే దిశగా నడవాలని నేతలు ఏకగ్రీవంగా అభిప్రాయపడ్డారు. ఈ సమావేశం మాదిగల రాజకీయ దిశలో కీలక మలుపుగా నిలిచిందని, రాబోయే రోజుల్లో మరింత వ్యూహాత్మక నిర్ణయాలు తీసుకోనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో నల్లా రాధాకృష్ణ, ముంజగాళ్ళ విజయ్, రాజలింగం, మహారాజ్,సుబద్ర,అందె భాస్కర్,యమున,రాజేందర్, నరసయ్య,ప్రొఫెసర్ తిరుపతి,మాదిగ మేధావులు అధిక సంఖ్యలో పాలొగొన్నారు.

# మడిపల్లి గ్రామంలో ఫ్లెక్సీ సంచలనం

**"నోట్లకు అమ్ముడయ్యే ఓట్లు మా ఇంట్లో లేవు" అని ధైర్యవంతమైన సందేశం**

**హనుమకొండ జిల్లా, నవంబర్ 30 (జై భీమ్ న్యూస్)**

గ్రామ పంచాయతీ ఎన్నికల వేళ హసన్‌పర్తి మండలం మడిపల్లి గ్రామం పేరును రాష్ట్రవ్యాప్తంగా వినిపించేలా చేసిన సంఘటన చోటు చేసుకుంది. రాజకీయ వేడి ఊపిరిలా మాడుతున్న ఈ సమయంలో, ఒక సాధారణ కుటుంబం ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ ఇప్పుడు గ్రామానికే కాదు ు మొత్తం జిల్లాకు నైతికత పాఠంగా మారుతోంది. వారి ఇంటి ముందు పెట్టిన ఆ ఫ్లెక్సీలో పెద్ద అక్షరాల్లో రాసి ఉన్న సందేశం ఇలా ఉంది. "నోట్లకు అమ్ముడయ్యే ఓట్లు మా ఇంట్లో లేవు%ొ% ఓట్ల కోసం నోట్లు పట్టుకుని మా ఇంట్లోకి ఎవరూ రాకండి%ొ% తస్మాత్ జాగ్రత్త." ఈ సందేశం గ్రామంలో ప్రచార వాతావరణాన్ని ఒక్కసారిగా మార్చేసింది. ఎన్నికల సమయంలో ఓట్ల కోసం డబ్బు పంచడం సాధారణంగా మారిపోయినా, ఈ కుటుంబం ఇచ్చిన ఆత్మగౌరవ భరితమైన స్వరం ప్రజాస్వామ్య విలువలను మరోసారి ముందుకు తెచ్చింది.

**సాధారణ కుటుంబం.. కానీ ఇచ్చిన సందేశం అసాధారణం..**

ఈ ఫ్లెక్సీ పెట్టిన కుటుంబం ఓటును పవిత్ర హక్కుగా భావిస్తోంది. గ్రామ అభివృద్ధికి నిజాయితీగా పని చేసే అభ్యర్థికే ఓటును ఇవ్వాలని, డబ్బు తీసుకుని ఓటు వేయడం వారి సంప్రదాయాలు, విలువలు, గ్రామం భవిష్యత్తుకు హాని చేస్తుందని వారు స్పష్టం చేశారు. మా పిల్లల భవిష్యత్తు కోసం, మా గ్రామం కోసం ు డబ్బుతో ఓట్లు కొనడం మేమెప్పుడూ అంగీకరించము. ఓటు అంటే గౌరవం%ొ% అది అమ్మడానికి కాదు అని ఆ కుటుంబం ప్రకటించింది. వారు ఎవరికి వ్యతిరేకంగా కాకుండా ు 'సేవ చేసేవారే నాయకులు కావాలి' అనే నైతిక దృక్పథాన్ని ముందుకు తీసుకువచ్చారు.

**గ్రామ ప్రజల ప్రశంసలు.. చర్చలతో సందడి..**

ఫ్లెక్సీ పెట్టిన గంటల వ్యవధిలోనే గ్రామస్తులు అందరూ ఈ సందేశంపై చర్చలు ప్రారంభించారు. వృద్ధులు మాట్లాడుతూ ఈరోజుల్లో ఇలాంటి ధైర్యవంతమైన కుటుంబాలు అరుదు. ఇవే గ్రామ రాజకీయాలను శుభ్రం చేస్తాయన్నారు. యువత మాట్లాడుతూ ఫ్లెక్సీ ఫొటోలను సోషల్ మీడియాలో షేర్ చేస్తూ నైతిక ఓటు హక్కుపై చర్చలు చేస్తున్నారు. మహిళలు మాట్లాడుతూ పిల్లలకు మంచి విలువలు నేర్పే కుటుంబం ఇది. డబ్బుతో వచ్చే రాజకీయాలు భవిష్యత్తును నాశనం చేస్తాయి అని అభినందిస్తున్నారు. కొంతమంది స్థానిక నాయకులు కూడా ఈ సందేశాన్ని గౌరవిస్తూ, ప్రజలు స్వచ్ఛమైన నిర్ణయం తీసుకోవడం ఎన్నికల ప్రభావాన్ని మారుస్తుందనే అభిప్రాయం తెలిపారు.

**ఎన్నికల ముందు నైతిక చైతన్యానికి నాంది..**

ఈ కుటుంబం గ్రామస్తులతో కూడా మాట్లాడి కొన్ని సూచనలు ఉంచింది – ఎన్నికల సమయంలో డబ్బు పంచే వారికి గ్రామస్తులే అడ్డుకట్ట వేయాలి, నోట్లకు కాదు ు సేవకు ఓటు అనే అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలి, యువత, విద్యార్థులలో ప్రజాస్వామ్య విలువలపై చర్చలు చేపట్టాలి. ఈ సూచనలను గ్రామ పంచాయతీ సభ్యులు కూడా అభినందించారు.

**ఇతర గ్రామాలకు ఆదర్శంగా మారిన మడిపల్లి ఫ్లెక్సీ..**

మడిపల్లిలో ఒక చిన్న కుటుంబం చేసిన ఈ చిన్న చర్య ఇప్పుడు పెద్ద సందేశంగా మారింది. ఓటు అమ్ముకునే సంస్కృతిపై ప్రశ్నార్థకం పెట్టి, ప్రజాస్వామ్య విలువలను కాపాడే దిశగా ఇది ఒక మంచి ప్రారంభమైంది. ఇప్పటికే ఇతర గ్రామాల్లో కూడా ఇలాంటి ఫ్లెక్సీల గురించి చర్చలు మొదలయ్యాయి. మొత్తానికి ు మడిపల్లి ఫ్లెక్సీ కేవలం పోస్టర్ కాదు%ొ% ప్రజాస్వామ్యానికి నిలువెత్తు నినాదం. ఓటు విలువను గుర్తు చేసిన కుటుంబం చేసిన ఈ ప్రయత్నం గ్రామాభివృద్ధికి, విలువలకు, నైతికతకు నిలువెత్తు ఉదాహరణగా నిలిచింది.




# మత్తు వదలండి - మైదానానికి రండి





**హనుమకొండ బ్యాడ్మింటన్ టోర్నమెంట్ ప్రారంభించిన ఎమ్మెల్యే నాగరాజు**

**హనుమకొండ, నవంబర్ 30 (జై భీమ్ న్యూస్)**

భీమారం ప్రాంతంలో నిర్వహించిన బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌ను వర్ధన్నపేట నియోజకవర్గ ఎమ్మెల్యే, విశ్రాంత ఐపీఎస్ అధికారి కేఆర్ నాగరాజు ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే స్వయంగా రాకెట్ పట్టి క్రీడాకారులతో సరదాగా బ్యాడ్మింటన్ ఆడడంతో అక్కడి యువతలో ఉత్సాహం రెట్టింపైంది. అనంతరం బ్యాడ్మింటన్ కోచ్ శీలం నరేందర్‌ను శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో మాట్లాడుతూ ఎమ్మెల్యే నాగరాజు, క్రీడలు శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక ఉల్లాసాన్ని, వికాసాన్ని అందిస్తాయని అన్నారు. క్రీడల్లో గెలుపు%-%ఓటములు సహజమని, నేటి ఓటమి రేపటి గెలుపుకు నాంది అవుతుందని, క్రీడాస్ఫూర్తి ప్రతి ఆటగాడిలో ఉండాలని సూచించారు. యువత మత్తును వదిలి క్రీడలు, మైదానాలవైపు అడుగులు వేయాలని పిలుపునిచ్చారు. తాను కూడా ఒక స్పోర్ట్స్ మెన్‌గా క్రీడాకారులకు అండగా ఉంటూ, వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. సీఎం రేవంత్ రెడ్డి న రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రభుత్వం క్రీడల అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తోందని, తెలంగాణ రాష్ట్రంలో నాలుగో స్పోర్ట్స్ స్కూల్‌ను హనుమకొండ జేఎన్ఎస్ స్టేడియంలో ప్రారంభించడం దానికి నిదర్శనమని పేర్కొన్నారు. పర్వతగిరి మండలం కల్లెడకు చెందిన పారా అథ్లెట్ దీప్తి జీవాంజీకి ప్రభుత్వం కోటి రూపాయలు మంజూరు చేసి ప్రోత్సహించిందని తెలిపారు. వర్ధన్నపేట నియోజకవర్గంలో క్రీడా వసతులను బలోపేతం చేసేందుకు చర్యలు కొనసాగుతున్నాయని, హసన్‌పర్తి ప్రాంతంలో ఇండోర్ స్టేడియం ఏర్పాటు కోసం తన కృషి త్వరలో ఫలితాలు ఇస్తుందని, స్టేడియం రూపుదిద్దుకుంటుందని ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమంలో బ్యాడ్మింటన్ టోర్నమెంట్ ఆర్గనైజర్ బోయిని శశికాంత్, నాయకులు కనపర్తి కిరణ్, వీసం సురేందర్ రెడ్డి, పుల్ల రవీందర్, బండి చైతన్య రెడ్డి, గరిగె రాజు, పెద్దమ్మ సురేష్, శీలం యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

# ఎస్సీ-ఎస్టీలకు క్రిమిలేయర్ విధానం అన్యాయం

## కెవిపిఎస్ హనుమకొండ జిల్లా ప్రధాన కార్యదర్శి మంద సంపత్

**హనుమకొండ, నవంబర్ 30 (జై భీమ్ న్యూస్)**

ఎస్సీ-ఎస్టీ వర్గాలపై క్రిమిలేయర్ విధానం అమలు చేయడం ఆర్థికంగా, సామాజికంగా తీవ్ర అన్యాయం అవుతుందని కెవిపిఎస్ హనుమకొండ జిల్లా ప్రధాన కార్యదర్శి మంద సంపత్ తీవ్రంగా విమర్శించారు. ఆదివారం రామ్‌నగర్ సుందరయ్య భవన్‌లో జిల్లా అధ్యక్షులు ఓరుగంటి సాంబయ్య అధ్యక్షతన జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన ప్రసంగించారు. మంద సంపత్ మాట్లాడుతూ గత ఏడాది దేవేందర్ సింగ్ వర్సెస్ పంజాబ్ స్టేట్ గవర్నమెంట్ కేసులో ఏడుగురు న్యాయమూర్తుల రాజ్యాంగ ధర్మాసనం, ముఖ్యంగా జస్టిస్ గవాయి ఎస్సీ%-%ఎస్టీ వర్గీకరణపై చేసిన వ్యాఖ్యలు, తీర్పు వర్గీకరణకు మద్దతు తెలిపినా, క్రిమిలేయర్ అమలు గురించి ఎక్కడా ప్రస్తావించలేదని తెలిపారు. ఇదే విషయాన్ని కేంద్ర బీజేపీ ప్రభుత్వం, ఎస్సీ%-%ఎస్టీ ఎంపీలు ప్రధానమంత్రి నరేంద్ర మోడీ దృష్టికి తీసుకెళ్లగా, మోడీ స్వయంగా క్రిమిలేయర్‌ను ఎస్సీ%-%ఎస్టీలకు వర్తింపజేయమని హామీ ఇచ్చారని పేర్కొన్నారు. అయితే ఆ హామీ ఉన్నప్పటికీ తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ వంటి రాష్ట్రాలు చట్టంలో క్రిమిలేయర్ అంశం లేకుండానే వర్గీకరణను అమల్లోకి తీసుకురావడం అభినందనీయమని చెప్పారు. అయినప్పటికీ ఉన్నత ఉద్యోగాల్లో ఉన్న ఎస్సీ%-%ఎస్టీ వర్గాల పిల్లలకు రిజర్వేషన్ అవసరం లేదని చెప్పడం అన్యాయమని సంపత్ మండిపడ్డారు. ఒక వ్యవసాయ కూలీ కుమారుడు, ఒక ఉన్నతాధికారి కుమారుడిని రిజర్వేషన్ పరంగా ఒకేలా చూడడం సహజ న్యాయసూత్రాలకు, రాజ్యాంగ మూలాంశాలకు విరుద్ధమని అన్నారు. రిజర్వేషన్ ఉద్యోగాలకే కాకుండా విద్యా అవకాశాలకు, ఫీజు రీయింబర్స్‌మెంట్‌కి, గురుకుల పాఠశాలల ప్రవేశాలకు సంబంధించిన హక్కు. ఇవి తండ్రి ఉద్యోగం, ఆదాయం ఆధారంగా మారిపోని జన్మసిద్ధ హక్కులు అని ఆయన స్పష్టం చేశారు. ఎస్సీల రిజర్వేషన్ విచ్ఛిన్నం చేసేందుకు ప్రయత్నిస్తున్నట్లుగా కొన్ని వ్యాఖ్యలు, అభిప్రాయాలు కనిపిస్తున్నాయని, క్రిమిలేయర్ అనే పేరుతో ఎస్సీ%-%ఎస్టీ వర్గాల హక్కులను తొలగించే ప్రయత్నాలు తీవ్రంగా ఎదుర్కోవాలని తెలిపారు. ఎస్సీ ఉద్యోగి పదవీ విరమణ తర్వాత కేవలం 80 వేల పింఛన్‌తోనే పోషించబడతారని, బీసీల మాదిరిగా మెరిట్‌లో పోటీపడాలని చెప్పడం వాస్తవ పరిస్థితులను అసలు అర్థం చేసుకోకుండానే చేసిన వ్యాఖ్యలని అన్నారు. తండ్రి ఆదాయం పేరుతో సంతానానికి రాజ్యాంగబద్ధమైన రిజర్వేషన్ హక్కును ఖండించడం అసలు సరైన పద్ధతి కాదని ఆయన స్పష్టం చేశారు. సంపత్ మరింతగా మాట్లాడుతూ తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలు చేస్తున్నట్లుగా క్రిమిలేయర్ లేకుండా ఎస్సీ%-%ఎస్టీ వర్గీకరణను అన్ని రాష్ట్రాలు అమలు చేయాలనీ, దీనిపై రాష్ట్ర ప్రభుత్వాలు స్పష్టమైన ఆదేశాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఎస్సీ%-%ఎస్టీ వర్గాల ఆర్థిక, సామాజిక పునాది దెబ్బతింటుందని హెచ్చరించారు. అవసరమైతే సామాజిక కార్మిక వర్గ సంఘాలను కలుపుకొని రాష్ట్రవ్యాప్తంగా, దేశవ్యాప్తంగా ఆందోళనలు చేపట్టేందుకు సిద్ధంగా ఉన్నామని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో కెవిపిఎస్ జిల్లా నాయకులు మంద మల్లేశం, మారుతి, రమేష్, పాపయ్య తదితరులు పాల్గొన్నారు.



# నామినేషన్ల స్వీకరణ ప్రక్రియను సక్రమంగా నిర్వహించాలి

**హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్**





**హసన్‌పర్తి, నవంబర్ 30 (జై భీమ్ న్యూస్)**

హనుమకొండ జిల్లా హసన్‌పర్తి మండలం రెండో విడత మండలాల్లో సర్పంచ్, వార్డు సభ్యుల స్థానాలకు నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ ఆదివారం ప్రారంభమైంది. ఈ నేపథ్యంలో హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ హసన్‌పర్తి మండలంలోని సీతంపేట, నాగారం క్లస్టర్ గ్రామ పంచాయతీ కార్యాలయాలను సందర్శించి నామినేషన్ స్వీకరణ ఏర్పాట్లను పరిశీలించారు. సీతంపేట గ్రామ పంచాయతీలో ఏర్పాటు చేసిన క్లస్టర్ నామినేషన్ కేంద్రాన్ని పరిశీలించిన కలెక్టర్, ఏయే గ్రామాలకు నామినేషన్లు స్వీకరించబడతాయో, అభ్యర్థుల సమర్పణ ప్రక్రియ ఎలా కొనసాగుతుందో తెలుసుకున్నారు. నామినేషన్ల స్వీకరణలో పారదర్శకత, సమర్థత అత్యంత కీలకమని అధికారులు పెను జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా కలెక్టర్ స్నేహ శబరీష్ మాట్లాడుతూ, నామినేషన్ కేంద్రాల వద్ద ఓటర్ల జాబితాను స్పష్టంగా ప్రదర్శించాలి, అభ్యర్థులకు అవసరమైన సమాచారాన్ని అందించడానికి హెల్ప్ డెస్క్‌ను సమర్థవంతంగా నిర్వహించాలని ఆదేశించారు. నామినేషన్ల స్వీకరణకు తగిన సంఖ్యలో కౌంటర్లు ఏర్పాటు చేసి, అభ్యర్థులు మరియు ప్రజలు ఇబ్బంది పడకుండా చూడాలని అన్నారు. ఎన్నికల విధుల్లో ఉన్న అధికారులు, పంచాయతీ కార్యదర్శులు గుర్తింపు కార్డులను తప్పనిసరిగా ధరించాలని కూడా సూచించారు. తరువాత నాగారం క్లస్టర్ గ్రామ పంచాయతీ కార్యాలయాన్ని సందర్శించిన కలెక్టర్, అక్కడి ఏర్పాట్లను కూడా సమీక్షించారు. నామినేషన్ ప్రక్రియను ప్రతీ అధికారుడు కచ్చితత్వంతో నిర్వహించాలని ఆమె పేర్కొన్నారు. ఈ పరిశీలన కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ రవి, ఎంపీడీఓ సుమనవాణి, తహసిల్దార్ కిరణ్ కుమార్ సహా ఇతర అధికారులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్‌ను వీడుతున్న కార్యకర్తలు

**సకాలంలో సేవలు అందలేకనే ప్రజలు పార్టీ మారుతున్నారు**

**ఆశించిన స్థాయిలో ప్రజలకు ఫలితాలు ఇవ్వని ప్రభుత్వం**

**బీఆర్ఎస్‌లోకి కాంగ్రెస్, బీజేపీ కీలక నేతలు**



**ఐనవోలు : (జై భీమ్ న్యూస్)**

గత పదేళ్లలో జరిగిన అభివృద్ధిని చూసి వివిధ పార్టీల నుంచి పెద్ద ఎత్తున బీఆర్ఎస్ పార్టీలో చేరుతున్నారని మండల కన్వీనర్ తంపుల మోహన్ అన్నారు. మండలంలోని నందనం గ్రామంలో మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు ఆదేశాల మేరకు బీఆర్ఎస్ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశం గ్రామ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు ఇసురం సుదర్శన్ ఆధ్వర్యంలో జరిగింది. కాంగ్రెస్, బీజేపీ పార్టీల నుంచి కీలక నాయకులు బీఆర్ఎస్‌లో చేరారు. వారికి గులాబీ కండువాలు కప్పి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మాట్లాడిన వారు... కాంగ్రెస్ పాలనలో అభివృద్ధి అటకెక్కిందన్నారు. సంక్షేమాన్ని రేవంత్ సర్కారు మరిచిందన్నారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ ఇంచార్జ్ రాంమూర్తి, ఎఫ్.ఎస్.సి.ఎస్ వైస్ చైర్మన్ పూర్ణచందర్, మండల నాయకులు మరుపట్ల దేవదాస్, బుర్ర సుధాకర్ గౌడ్, పేసర్ సంపత్, దోనికేన అశోక్, రంగు సంతోష్, యాకర రమేష్, ప్రభాకర్, యూత్ నాయకుడు మహ్మద్ పష, మహేష్, రమేష్, రాకేష్‌తో పాటు భారీ సంఖ్యలో స్థానిక కార్యకర్తలు పాల్గొన్నారు.

# పెద్దవంగర మండలంలో కాంగ్రెస్‌కు భారీ ఎదురుదెబ్బ

**బీఆర్ఎస్‌లో చేరిన జాటోత్ కమలాకర్**

**మహబూబాబాద్, నవంబర్ 30 (జై భీమ్ న్యూస్)**



పెద్దవంగర మండలం బొమ్మకల్లు (రెడ్డికుంట తండా) గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, తెలంగాణ ఉద్యమకారుడు, తొర్రూరు మాజీ జడ్పీటీసీ జాటోత్ కమలాకర్ స్థానిక సంస్థల ఎన్నికల సమయంలో కాంగ్రెస్‌కు భారీ షాక్ ఇచ్చారు. నేడు పర్వతగిరిలో మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు సమక్షంలో ఆయన స్వచ్ఛందంగా బీఆర్ఎస్ పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో మండల బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామ పెద్దలు తదితర ముఖ్యులు పాల్గొన్నారు. కమలాకర్ చేరికతో మండల రాజకీయాల్లో కొత్త చర్చలు మొదలయ్యాయి.

# జనసంద్రంలా మారిన మానవతావాది కర్ణకంటి బ్రహ్మచారి అంతిమయాత్ర

### అందరి ఆత్మబంధువుగా నిలిచిన మానవతావాది



**కరీంనగర్, రేకుర్తి, నవంబర్ 30 (జై భీమ్ న్యూస్)**

హనుమకొండ జిల్లా హసన్‌పర్తి మండలం మడిపల్లి స్వగ్రామమైనప్పటికీ, కరీంనగర్ రేకుర్తిలో స్థిరపడి అక్కడి ప్రజల మనసును గెలుచుకున్న కర్ణకంటి బ్రహ్మచారి మరణం స్థానికులలో తీవ్ర విషాదాన్ని నింపింది. రేకుర్తిలో మంగళవారం జరిగిన ఆయన అంత్యక్రియలు అత్యంత ఘనంగా నిర్వహించగా, శవయాత్ర జనసంద్రంలా మారింది. బ్రహ్మచారి చిన్న వయస్సులోనే కుటుంబ బాధ్యతలను భుజాన వేసుకుని, తండ్రీ స్థానంలో నిలబడి ఒక అక్క, ఇద్దరు చెల్లెళ్ల జీవితాలను సక్రమ మార్గంలో నడిపించారు. వారి పెళ్లిళ్ల వరకు అన్నివిధాలా అండగా నిలిచి, కుటుంబానికి ఆదరణగా మారారు. కుటుంబ ప్రేమను గ్రామం వరకు విస్తరించి, ఎవరి సమస్య వచ్చినా ముందుండి పరిష్కరించే స్వభావం ఆయనను అందరి "ఆత్మ బంధువు"గా నిలిపింది. సామాజిక సేవలో ముందుండే బ్రహ్మచారి మరణం గ్రామానికి పెద్ద లోటుగా మారిందని ప్రజలు భావోద్వేగంతో తెలిపారు. ఆయన పార్థివదేహాన్ని అంత్యక్రియల స్థలానికి తీసుకెళ్లే శవయాత్రలో గ్రామ పెద్దలు, బంధుమిత్రులు, యువత, మహిళలు భారీ సంఖ్యలో పాల్గొని చివరి వీడ్కోలు పలికారు. గ్రామానికి సేవలందించిన నిజమైన మానవతావాది ఆయన. ఇలాంటి వ్యక్తి మళ్లీ దొరకడం కష్టమని గ్రామస్థులు కన్నీరు మున్నీరయ్యారు. ఈ కార్యక్రమంలో కుటుంబ సభ్యులతో పాటు, బంధుమిత్రులు, ఆత్మబందువులు, స్నేహితులు, జిల్లాల నుండి తరలి వచ్చిన నాయకులు, మడిపల్లి గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# రెండో విడత ఐదు మండలాల్లో మొదలైన నామినేషన్ల ప్రక్రియ

### సర్పంచ్ స్థానాలకు 51, వార్డులకు 44 నామినేషన్లు

**హనుమకొండ, నవంబర్ 30 (జై భీమ్ న్యూస్)**

రెండో విడత గ్రామ పంచాయతీ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ హనుమకొండ జిల్లాలోని ఐదు మండలాల్లో ఆదివారం మొదలైంది. ధర్మసాగర్, హసన్‌పర్తి, ఐనవోలు, వేలేరు, పరకాల మండలాల్లోని గ్రామ పంచాయతీలకు సర్పంచ్, వార్డు స్థానాలకు నామినేషన్ల పర్వం ప్రారంభమైంది. రెండో విడత ఐదు మండలాల్లో మొదటి రోజు సర్పంచ్ స్థానాలకు 51 నామినేషన్లు అభ్యర్థులు వేయగా, వార్డు స్థానాలకు 44 మంది అభ్యర్థులు తమ నామినేషన్ పత్రాలను ఆర్‌ఓలకు సమర్పించారు. నామినేషన్ల మొదటి రోజైన ఆదివారం ధర్మసాగర్ మండలంలో సర్పంచ్ స్థానాలకు 21 నామినేషన్లు, వార్డు స్థానాలకు 19 నామినేషన్లు రాగా హసన్‌పర్తి మండలంలో సర్పంచ్‌లకు 8, వార్డులకు 11 నామినేషన్లు, ఐనవోలు మండలంలో సర్పంచులకు 8, వార్డులకు 6 నామినేషన్లు వచ్చాయి. వేలేరు మండలంలో సర్పంచ్ స్థానాలకు 6, వార్డులకు 6 నామినేషన్లు రాగా పరకాల మండలంలో సర్పంచులకు 8, వార్డు స్థానాలకు 2 నామినేషన్లు వచ్చాయి. ఐదు మండలాల్లోని క్లస్టర్ గ్రామ పంచాయతీ కార్యాలయాలలో నామినేషన్ల స్వీకరణ కేంద్రాలను ఏర్పాటు చేయగా అభ్యర్థుల నుండి ఉదయం 10:30 నుండి సాయంత్రం 5 గంటల వరకు అధికారులు నామినేషన్ పత్రాలను స్వీకరించారు. కాగా రెండో విడత మండలాల్లో ప్రారంభమైన నామినేషన్ల స్వీకరణ ప్రక్రియను జిల్లా కలెక్టర్, అధికారులు పరిశీలించారు. హసన్‌పర్తి మండలంలోని సీతంపేట, నాగారం క్లస్టర్ గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో నామినేషన్ల ప్రక్రియను జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ పరిశీలించారు. జడ్పీ సీఈఓ రవి, పరకాల ఆర్డీఓ డాక్టర్ కన్నం నారాయణ, ఇతర అధికారులు పరకాల మండలంలోని వెల్లంపల్లి, నాగారం, లక్ష్మీపూర్, కామారెడ్డిపల్లి గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో నామినేషన్ల ప్రక్రియను పరిశీలించారు. ఆయా మండలాలకు సంబంధించిన ఎంపీడీవోలు నామినేషన్ల స్వీకరణ కేంద్రాలలో నామినేషన్ల ప్రక్రియను పరిశీలించారు.

# కొండగట్టు ఆంజనేయస్వామి గుట్ట కింద జరిగిన అగ్నిప్రమాదం





### చిరు వ్యాపారులకు తీవ్రమైన నష్టం

**జగిత్యాల, నవంబర్ 30, 2025 (జై భీమ్ న్యూస్)**

ప్రముఖ పుణ్యక్షేత్రం కొండగట్టు ఆంజనేయస్వామి గుట్ట కింద శనివారం రాత్రి ఘోర అగ్నిప్రమాదం చోటు చేసుకుంది. వరుసగా ఉన్న పలు దుకాణాలు ఒక్కసారిగా మంటల్లో చిక్కుకుని పూర్తిగా బూడిదగా మారాయి. ఈ ఘటనలో చిరు వ్యాపారులు తీవ్రంగా నష్టపోయారు. జీవనాధారంగా నడుపుకుంటున్న షాపులు క్షణాల్లో కాలి బూడిదైపోవడంతో యజమానులు తీవ్ర విచారంలో మునిగిపోయారు. ఒక్క రాత్రిలో జీవితాలు రోడ్డున పడ్డాయని బాధపడుతున్న వ్యాపారులు, తాము ఎన్నాళ్లుగా కష్టపడి సంపాదించిన ఆస్తి నిమిషాల్లో నాశనమైందని వాపోయారు. వారి విలపనలు, మంటల్లో కాలిపోయిన దుకాణాల ముందు కన్నీళ్లు పెట్టుకున్న దృశ్యాలు చూసిన వారందరినీ కలచివేశాయి. అగ్నిప్రమాదం ఎలా సంభవించిందనే దానిపై అధికారులు దర్యాప్తు చేస్తున్నారు. మంటలను నియంత్రించేందుకు అగ్నిమాపక సిబ్బంది ప్రయత్నించినప్పటికీ, అప్పటికే దుకాణాలు పూర్తిగా దగ్ధమైపోయాయి. స్థానికులు కూడా మంటల నియంత్రణలో సహాయపడ్డారు. చిరు వ్యాపారుల నష్టాన్ని అంచనా వేసి, వారికి సహాయక చర్యలు చేపట్టాలంటూ ప్రజలు, భక్తులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

# పారదర్శకంగా స్క్రూటినీ నిర్వహించాలి






### కలెక్టర్ డాక్టర్ సత్య శారద ఆదేశాలు
### వర్ధన్నపేట మండలంలో స్క్రూటినీ నిర్వహణ, ధాన్యం కొనుగోలు కేంద్రాలపై సమీక్ష

**వరంగల్/వర్ధన్నపేట, 30 నవంబర్ 2025 (జై భీమ్ న్యూస్)**

రెండవ సాధారణ పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో సర్పంచ్, వార్డు సభ్యుల నామినేషన్ల స్క్రూటినీని పూర్తి పారదర్శకంగా, నిబంధనల ప్రకారం నిర్వహించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డాక్టర్ సత్య శారద అధికారులను ఆదేశించారు. ఆదివారం వర్ధన్నపేట మండలం ఉప్పరపల్లి, నల్లబెల్లి, లేబర్తి గ్రామాల్లోని రిటర్నింగ్ అధికారుల కార్యాలయాలను సందర్శించిన కలెక్టర్, స్క్రూటినీ ప్రక్రియను పరిశీలించి, సమర్థవంతమైన నిర్వహణకు సంబంధించి కీలక సూచనలు చేశారు. అనంతరం కలెక్టర్ కొత్తపల్లి గ్రామంలోని పిఏసిఎస్ ఆధ్వర్యంలో నడుస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని దర్శించారు. రోడ్డుపై ఆరబెట్టిన ధాన్యాన్ని పరిశీలించిన ఆమె, వర్షాలు కురిసే అవకాశాన్ని దృష్టిలో ఉంచుకుని ధాన్యాన్ని తప్పనిసరిగా తార్పాలిన్ పై ఆరబెట్టాలని, అలాగే ధాన్యం తడవకుండా రక్షణగా తార్పాలిన్‌తో కప్పాలని సూచించారు. రైతులు, నిర్వాహకుల అభ్యర్థన మేరకు ఆ కేంద్రానికి అదనంగా ప్యాడి క్లీనర్‌ను వెంటనే కేటాయించాలని సంబంధిత అధికారులను ఆమె ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జడ్పీ సీఈఓ రామిరెడ్డి, తహసిల్దార్ విజయ్ సహా సంబంధిత శాఖా అధికారులు పాల్గొన్నారు.

# రేబీస్ సకాలంలో వ్యాక్సిన్‌తో.. 100% నివారించగల ప్రాణాంతక వ్యాధి

## జాగ్రత్తలు తప్పనిసరి అని డా. అర్జున్ రాజ్ హెచ్చరిక

**లాడ్నూర్/జైభీమ్ హెల్త్ న్యూస్**

రేబీస్ అనేది కేంద్ర నాడీ వ్యవస్థను తీవ్రమైన స్థాయిలో దెబ్బతీసే, ర్యాబ్డోవిరిడే కుటుంబానికి చెందిన లైసా వైరస్ కారణంగా వచ్చే అత్యంత ప్రమాదకరమైన వైరల్ వ్యాధి. ఈ వ్యాధి లక్షణాలు ప్రారంభమైన తర్వాత చికిత్స ఉండదు, దాదాపు మరణం తప్పదు. అయితే, కుక్క లేదా ఇతర జంతువు కాటుకి తక్షణం వ్యాక్సిన్ తీసుకుంటే ఇది 100% నివారించగలిగే వ్యాధి అని వైద్యులు స్పష్టం చేస్తున్నారు. లాడ్నూర్ పీహెచ్ సి లో ఈ నెల 18 కుక్క కాటు కేసులు నమోదవడంతో ప్రజలు మరింత జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యుడు డా. అర్జున్ రాజ్ సూచించారు. కుక్క, కోతి, ఎలుగుబంటి వంటి జంతువులు కరిచినప్పుడు, గీకినప్పుడు లేదా ముందుగానే గాయం ఉన్న చర్మాన్ని నాకినప్పుడు రేబీస్ వైరస్ మన శరీరంలోకి ప్రవేశించే అవకాశం ఉంటుంది. రేబీస్ లక్షణాలు మొదట్లో సాధారణ వైరల్ లక్షణాల్లానే జ్వరం, గొంతునొప్పి రూపంలో కనిపిస్తాయి. తర్వాత దశలో గందరగోళం, ఆందోళన, నీటిని చూసినప్పుడే భయపడే హైడ్రోఫోబియా, కాంతిని కూడా భయపడటం, విచిత్ర ప్రవర్తన వంటి ప్రమాదకర లక్షణాలు బయటపడతాయి. ఈ దశకు చేరుకున్న తర్వాత రోగిని కాపాడటం సాధ్యంకాదు. అందుకే కుక్క కాటు జరిగిన వెంటనే గాయాన్ని రన్నింగ్ వాటర్‌తో 10%-%15 నిమిషాల పాటు కడిగి, సబ్బుతో శుభ్రం చేసి, ఆలస్యం చేయకుండా దగ్గరలోని ప్రభుత్వ ఆసుపత్రిలో వ్యాక్సిన్ తీసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు. గాయం చిన్నదైనా, కాటేసింది కుక్కపిల్లైనా ప్రమాదం తగ్గదు. డబ్ల్యూహెచ్ఓ సూచించిన రేబీస్ వ్యాక్సిన్ షెడ్యూల్ ప్రకారం 0, 3, 7, 14, 28 రోజులలో మొత్తం అయిదు డోసులు ఇస్తారు. కుక్క కాటును గాయాల తీవ్రత ఆధారంగా మూడు కేటగిరీలుగా విభజిస్తారు. కేటగిరి 1లో చర్మం పూర్తిగా సురక్షితంగా ఉంటే, కుక్క కేవలం నాకినంత మాత్రాన వ్యాక్సిన్ అవసరం లేదుబీ శుభ్రపరచడం సరిపోతుంది. కేటగిరి 2లో చిన్న కట్స్, స్క్రాచులు ఉంటే వ్యాక్సిన్ తప్పనిసరి. కేటగిరి 3లో పలుచోట్ల గాయాలు, లోతైన గాయాలు, కుట్లు వేయవలసిన పరిస్థితులు ఉంటే వ్యాక్సిన్‌తో పాటు ఇమ్యూనో గ్లోబులిన్లు కూడా ఇస్తారు. ఇవి ప్రధానంగా మెడికల్ కాలేజీలు, పెద్ద ఆసుపత్రుల్లో అందుబాటులో ఉంటాయి. గర్భిణీలు, బాలింతల విషయంలో కూడా రేబీస్ వ్యాక్సిన్ పూర్తిగా సురక్షితం. కుక్క కాటు తగిలితే గర్భధారణలో ఉన్నా, ప్రసవం తరువాత ఉన్నా ం వ్యాక్సిన్ తప్పనిసరిగా తీసుకోవాలి. తెలంగాణలో 2021 వరకు రేబీస్ కేసులు చాలా తక్కువగా ఉన్నప్పటికీ, ఇప్పుడు 2025లో కేసులు పెరుగుతున్నాయని ఆరోగ్య శాఖ డేటా తెలిపింది. ఈ నేపథ్యంలో ప్రజలు జంతువుల నుంచి దూరంగా ఉండి, తగిన జాగ్రత్తలు పాటించాలని వైద్యులు హెచ్చరిస్తున్నారు. ఈ సందర్భంలో లాడ్నూర్ పీహెచ్ సి వైద్యుడు డా. అర్జున్ రాజ్ మాట్లాడుతూ "కుక్కల నుంచి జాగ్రత్తగా ఉండండి. కాటు తగిలిన వెంటనే గాయం కడిగి, వ్యాక్సిన్ తీసుకోవడం మాత్రమే ప్రాణాలను కాపాడే మార్గం. జాగ్రత్తలు పాటించడం ప్రతి ఒక్కరి బాధ్యత" అని సూచించారు. సందేహాలు ఉన్నవారు సంప్రదించవచ్చు: డా. అర్జున్ రాజ్, ఎంబిబిఎస్ , ఎండీ చైర్మన్, సోషల్ మీడియా ం ఐఎంఎ హైదరాబాద్ సిటీ బ్రాంచ్, 8712345231.



# డిసెంబర్ 3న జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి మహా ధర్నా

### టీయూడబ్ల్యూజె (ఐజేయూ) ఆధ్వర్యంలో కరపత్రాల ఆవిష్కరణ

**హనుమకొండ, నవంబర్ 30 (జై భీమ్ న్యూస్)**

జర్నలిస్టుల సమస్యలను తక్షణం పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ టీయూడబ్ల్యూజె (ఐజేయూ) ఆధ్వర్యంలో డిసెంబర్ 3న హైదరాబాద్‌లో మహా ధర్నా నిర్వహించనున్నట్లు జిల్లా అధ్యక్షుడు గడ్డం రాజిరెడ్డి, ప్రధాన కార్యదర్శి తోట సుధాకర్ తెలిపారు. ఆదివారం హనుమకొండ బాలసముద్రలోని గ్రేటర్ వరంగల్ ప్రెస్ క్లబ్‌లో టీయూడబ్ల్యూజె జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ధర్నా కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జర్నలిస్టులు తక్షణమే అక్రిడిటేషన్ కార్డులు జారీ చేయాలని, జర్నలిస్టుల ఆరోగ్య భీమా పథకాన్ని పునరుద్ధరించాలని, అర్హులైన జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని, వృత్తి కమిటీని వెంటనే ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ నినాదాలు చేశారు. జర్నలిస్టుల సమస్యలపై గత రెండు సంవత్సరాలుగా ప్రభుత్వం తాత్సారం ప్రదర్శిస్తోందని, పలుమార్లు వినతిపత్రాలు ఇచ్చినా ఎటువంటి నిర్ణయం తీసుకోలేదని గడ్డం రాజిరెడ్డి, సుధాకర్ విమర్శించారు. ప్రభుత్వం పై ఒత్తిడి కోసం డిసెంబర్ 3న మాసాబ్‌ట్యాంక్‌లోని రాష్ట్ర సమాచార కమిషనర్ కార్యాలయం వద్ద ఉదయం 10 గంటలకు మహా ధర్నా నిర్వహించనున్నట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమాన్ని జాతీయ, రాష్ట్ర, జిల్లా, మండల కమిటీల నాయకులు, యూనియన్ సభ్యులు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో టీయూడబ్ల్యూజె రాష్ట్ర ఉపాధ్యక్షులు గాడిపెల్లి మధు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కంకనాల సంతోష్, జాతీయ కౌన్సిల్ సభ్యులు పీవీ మదన్ మోహన్, ప్రెస్ క్లబ్ మాజీ అధ్యక్షులు గడ్డం కేశవ మూర్తి, గ్రేటర్ వరంగల్ ప్రెస్ క్లబ్ ప్రధాన కార్యదర్శి బొల్లారపు సదయ్య, సహాయక కార్యదర్శి డాక్టర్ పొడిశెట్టి విష్ణు వర్ధన్, సీనియర్ నాయకులు సిహెచ్ సోమనర్సయ్య, ఎం. రాజేందర్ ప్రసాద్, అనుముల రవి, దేవేందర్, ఎండి ఉస్మాన్ పాషా తదితరులు పాల్గొన్నారు.



జై భీమ్ తెలుగు దినపత్రిక POWER OF PEOPLE
సమస్యలపై సమరంగా
Jai Bheem TV STRUGGLE FOR JUSTICE
సామాన్యుడి ఆయుధంగా

# ‘దండోరా’ మ్యూజికల్ జర్నీ షురూ..

ఆకట్టుకుంటున్న ‘పిల్లా’ సాంగ్



శివాజీ, నవదీప్, నందు, బిందు మాధవి ప్రధాన పాత్రల్లో నటిస్తున్న చిత్రం ‘దండోరా’. ఈ సినిమా నుంచి మ్యూజికల్ ప్రమోషన్లు మొదలయ్యాయి. ఇందులో భాగంగా తొలి పాట ‘పిల్లా’ సాంగ్’ లిరికల్ వీడియోను చిత్రబృందం విడుదల చేసింది. ఈ పాటకు ఆడియన్స్ నుంచి విశేష స్పందన వస్తోంది. మార్క్ కె రాబిన్ స్వరపరిచిన ఈ మెలోడీని అనురాగ్ కులకర్ణి, ఆదిత్య భవరాజు ఆలపించగా, పూర్ణాచారి సాహిత్యం అందించారు. టీ-సిరీస్ మ్యూజిక్ ద్వారా ఈ పాట విడుదలైంది. ఈ పాట కథలో చాలా కీలకమైన సందర్భంలో వస్తుంది. హీరో ప్రేమను హీరోయిన్ మాటల్లో చెప్పకుండా, పరోక్షంగా అంగీకరించే సున్నితమైన సన్నివేశాన్ని ఈ పాట ద్వారా చూపించారు. మృదువైన జానపద బాణీలో, సంభాషణ రూపంలో సాగే సాహిత్యం ప్రేక్షకులను ఆకట్టుకుంటోంది. జేడీ మాస్టర్ అందించిన కొరియోగ్రఫీ కూడా పాటలోని భావానికి తగ్గట్టుగా సింపుల్ స్టెప్స్‌తో ఉంది. లిరికల్ వీడియోలో రవికృష్ణ, మణిక చిక్కాల మధ్య కెమిస్ట్రీ సహజంగా పండింది. వారి హావభావాలు, టైమింగ్ పాటకు మరింత అందాన్ని తెచ్చిపెట్టాయి. మురళీకాంత్ దేవసోత్ రచన, దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ చిత్రాన్ని లౌక్య ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకంపై రవీంద్ర బెనర్జీ ముప్పానేని నిర్మిస్తున్నారు. ఈ చిత్రానికి వెంకట్ ఆర్. శకమూరి సినిమాటోగ్రఫీ అందిస్తుండగా, సృజన అడుసుమిల్లి ఎడిటర్‌గా పనిచేస్తున్నారు. డిసెంబర్ 25న ఈ సినిమాను ప్రపంచవ్యాప్తంగా విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు.

# రజనీకాంత్ ‘జైలర్ 2’లో బాలయ్య పాత్రలో విజయ్ సేతుపతి.. బాలకృష్ణ ఔట్!



సూపర్‌స్టార్ రజనీకాంత్ నటించిన ‘జైలర్’ సినిమా ఘనవిజయం సాధించిన సంగతి తెలిసిందే. ఆ చిత్రానికి సీక్వెల్‌గా ‘జైలర్ 2’ తెరకెక్కుతోంది. రజనీకాంత్ మళ్లీ ముత్తువేల్ పాండియన్ పాత్రలో సందడి చేయబోతున్నారు. అయితే, ఈ సీక్వెల్‌కు సంబంధించి ఓ ఆసక్తికరమైన ప్రచారం సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతోంది. చిత్రంలో ఓ కీలక క్యామియో పాత్రకు నందమూరి బాలకృష్ణ స్థానంలో తమిళ స్టార్ విజయ్ సేతుపతిని ఎంపిక చేసుకున్నట్లు జోరుగా వార్తలు వస్తున్నాయి. దర్శకుడు నెల్సన్ దిలీప్‌కుమార్ మొదటి భాగంలోనే ఓ ముఖ్య పాత్ర కోసం బాలకృష్ణను సంప్రదించినట్లు తెలుస్తోంది. కానీ, బాలయ్య ఇమేజ్, షెడ్యూల్ దృష్ట్యా ఆ ప్లాన్‌ను మార్చుకున్నారట. ఇప్పుడు ‘జైలర్ 2’లో అలాంటి పవర్‌ఫుల్ పాత్రకు విజయ్ సేతుపతిని ఎంపిక చేసుకున్నట్లు సమాచారం. తనదైన నటనతో పాత్రకు జాన్స్‌తో ఉంటానని మేకర్స్ భావిస్తున్నారు. ప్రస్తుతం విజయ్ సేతుపతి గోవాలో తన షెడ్యూల్‌ను షూట్ చేస్తున్నారట. ‘జైలర్’లో కన్నడ స్టార్ శివరాజ్‌కుమార్, మలయాళ సూపర్‌స్టార్ మోహన్‌లాల్ అతిథి పాత్రల్లో కనిపించి చిత్ర విజయంలో కీలక పాత్ర పోషించారు. ఇప్పుడు విజయ్ సేతుపతి పాత్ర కూడా అదేలా కథను మలుపు తిప్పేదిగా ఉంటుందని అంచనా. ఇది రజనీకాంత్‌తో విజయ్ సేతుపతి రెండో కాంబో అవుతుంది. గతంలో ‘పేట’లో కలిసి నటించారు. అయితే, ఈ అన్ని వార్తలు పైన చిత్ర బృందం నుంచి అధికారిక ప్రకటన లేదు. ప్రస్తుతం సోషల్ మీడియా, ఫ్యాన్ సర్కిల్స్‌లో జరుగుతున్న ఊహాగానాలు మాత్రమే. మేకర్స్ స్పష్టత ఇస్తేనే అసలు విషయం తెలుస్తుంది. ఒకవేళ ఇది నిజమైతే, రజనీకాంత్-విజయ్ సేతుపతి కాంబోపై అంచనాలు మరింత పెరుగుతాయి. చిత్రం 2026 ఫిబ్రవరి వరకు షూటింగ్ పూర్తి చేసి జూన్‌లో విడుదల చేయాలని ప్లాన్.





# ఓటీటీలోకి వచ్చేస్తున్న రష్మిక కొత్త సినిమా.. ఎందులోనంటే!

నేషనల్ క్రష్ రష్మిక మంధాన తాజా సినిమా ‘ది గర్ల్ ఫ్రెండ్’ త్వరలో ఓటీటీలోకి రానుంది. నవంబర్ 7న విడుదలైన ఈ సినిమా ప్రేక్షకుల ఆదరణ పొందిన విషయం తెలిసిందే. రాహుల్ రవీంద్రన్ దర్శకత్వంలో రూపొందిన గర్ల్ ఫ్రెండ్ సినిమాలో రష్మిక ప్రధానపాత్రలో నటించారు. ఈ సినిమాలో భూమా పాత్రలో రష్మిక జీవించారని ప్రేక్షకులు ప్రశంసించారు. ప్రస్తుతం ఈ సినిమా ఓటీటీలోకి రానుంది. ప్రముఖ ఓటీటీ వేదిక నెట్‌ఫ్లిక్స్ లో డిసెంబర్5 నుంచి స్ట్రీమింగ్ కానుంది. తెలుగు, హిందీ, తమిళ్, కన్నడ, మలయాళ భాషల్లో ఇది అందుబాటులోకి రానున్నట్లు నెట్‌ఫ్లిక్స్ అధికారికంగా ప్రకటించింది.